క్లుప్తంగా

మహిళా కార్మికులకు కిట్లు అందజేత



కిట్లు అందుకున్న మహిళా కార్మికులు

ఒంగోలు అర్బన్: రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు వర్మ క్యాటరింగ్‌లో పనిచేసే 40 మంది మహిళా కార్మికులకు రెడ్‌క్రాస్ ద్వారా శనివారం హైజీన్ కిట్లు అందజేశారు. మేనేజింగ్ కమిటీ, బ్లడ్ బ్యాంకు కన్వీనర్ మంగళగిరి నరసింహారావు చేతుల మీదుగా ఒక్కో కిట్ రూ.500 విలువ చేసే వాటిని కార్మికులకు ఉచితంగా పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ కన్వీనర్ శ్రీనివాసరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

12 మంది పేస్ విద్యార్థులకు బహుమతులు



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను అభినందిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు: స్థానిక పేస్ కాలేజీలో ఇటీవల జరిగిన ఎన్‌సీసీ క్యాడెట్ క్యాంపులో 12 మంది పేస్ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ విద్యార్థులను అభినందించారు. ఫైరింగ్, అబ్‌స్టకిల్, డ్రిల్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ హైజీన్, నృత్య ప్రదర్శనలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, స్టూడెంట్ డీన్ అఫైర్స్ జి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: వయోవృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదేనని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అన్నారు. దానికి సంబంధించిన బ్రోచర్‌ను శనివారం సంతనూతలపాడులో ఆవిష్కరించారు. తల్లిదండ్రుల పోషణ సంక్షేమ చట్టం 2007, హెల్ప్‌లైన్ 14567కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించిన అనంతరం చెంచిరెడ్డి మాట్లాడుతూ ఈ చట్టం ప్రకారం వయో వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ నిమిత్తం ప్రతి నెలా రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పిల్లలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ పీ జాన్‌బాబు, కిరణ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గైర్హాజరైన అభ్యర్థులకు మరో అవకాశం

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 37 కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్, పీఈటీ, సీఆర్‌టీ, పీజీటీల పోస్టులకు మొదటిసారి విడుదల చేసిన 1:3 మెరిట్ లిస్టులో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు గైర్హాజరైన అభ్యర్థులకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. గైర్హాజరైన వారి జాబితాను డీఈవో ప్రకాశం వెబ్‌సైట్‌లో ఉంచారని, ఆదివారం సాయంత్రం 5 గంటల్లోగా తగిన ఆధారాలతో వచ్చి పరిశీలన చేయించుకోవాలన్నారు.

నేడు బీజేపీ బహిరంగ సభ

ఒంగోలు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1975 జూన్ 25న విధించిన ఎమర్జన్సీ రోజుల వెతలను గుర్తు చేసుకుంటూ బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జి యానం చినయోగయ్యయాదవ్ తెలిపారు. శనివారం స్థానిక బీజేపీ ఒంగోలు అసెంబ్లీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక విష్ణు ప్రియ ఫంక్షన్‌హాలులో బహిరంగ సభ ప్రారంభమవుతుందన్నారు.

జగనన్న సురక్షను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ పిలుపు
- ఒంగోలు నగరంలోని పలు డివిజన్లలో పర్యటన



త్రోవగుంటలో జగనన్న సురక్ష సర్వేని పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాస్

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ఒంగోలు నగరంలో అధికారులు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ తిరిగి పథకం ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. త్రోవగుంటతో పాటు మారుతీ నగర్‌లో పర్యటించారు. ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పలు సచివాలయాల పరిధిలో పర్యటించారు. త్రోవగుంటలో జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. కమిషనర్, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఇతర సేవా కార్యక్రమాలేమైనా రావాల్సి ఉన్నాయా అని ఆరా తీశారు. అర్హత ఉండి ఏ పథకమైనా రాకపోతే అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం, సర్టిఫికెట్లు పూర్తి స్థాయిలో అందాలన్నారు. అర్హత ఉండి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి అందించడమే జగనన్న సురక్ష పథకం ఉద్దేశమన్నారు. క్యాస్ట్, ఇన్కం, బర్త్, డెత్, మ్యారేజ్ సర్టిఫికెట్, ఫ్యామిలీ, లావాదేవీల బదిలీలు, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ వంటి డాక్యుమెంట్లు కలిపి 11 రకాల సర్టిఫికెట్లకు ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పథకం జూలై ఒకటి నుంచి నెల రోజుల పాటు అమలులో ఉంటుందని వివరించారు. అందుకోసం సచివాలయాల వారీగా క్యాంపులు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. వలంటీర్లు ఆయా సచివాలయాల పరిధిలో ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్క ఇంటినీ జల్లెడ పట్టాలని జేసీ ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలో శనివారం ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈతముక్కల–1, అల్లూరు–1 గ్రామ సచివాలయాల పరిధిలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలన్నీ వచ్చాయా..? అని అడిగి తెలుసుకున్నారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాల గురించి వివరించారు. వారం రోజులు సర్వే ఉంటుందని, 8వ రోజు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామని చెప్పారు. ఆగస్టు 1న అర్హులతో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయిస్తామన్నారు. గ్రామంలో అర్హులెవరూ పథకం రాలేదని అనకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, కిరణ్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడులో పరిశీలించిన జేసీ...

మద్దిపాడు: జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేను జేసీ శ్రీనివాసులు మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు గ్రామంలో శనివారం పరిశీలించారు. లబ్ధిదారులకు కావాల్సిన సర్టిఫికెట్లు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ డీఎల్‌డీవో ఉషారాణి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రజనీకుమారి, సర్పంచ్ శిల్పసౌందర్య, వైఎస్సార్ సీపీ నాయకుడు గుడ్డపాతల రవి, పలువురు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరిగి జగనన్న సురక్ష సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో కంచర్ల సుధాకర్, గ్రామ సర్పంచ్ బత్తుల రవీన, కోయి హనుమయ్య, కొండయ్య, కట్టా రాజా తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

పథకాలను సద్వినియోగం చేసుకోండి

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం సంతనూతలపాడు మండలం గుమ్మళంపాడు గ్రామంలో మన ఊరు–మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీజేఆర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులై ఉండి సాంకేతిక కారణాల వలన పథకాలు అందని వారి సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు ఉపయోగించుకుని రాయితీపై యంత్ర పరికరాలు పొందవచ్చన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువులను ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ షేక్ పాత్స్యా సాహెబ్, స్థానిక నాయకులు బొక్కిశం శివరామయ్య, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- పాల్గొన్న మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి



50వ డివిజన్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీకి శంకుస్థాపన చేస్తున్న మేయర్ గంగాడ సుజాత, బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు సబర్బన్: నగరంలో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపనలు చేశారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి పాల్గొని 50, 15 డివిజన్లలో అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. 15వ డివిజన్ అన్నవరప్పాడులో రూ.35 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువకు స్థానిక కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్‌తో కలిసి భూమి పూజ చేశారు. డివిజన్‌లో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. 50వ డివిజన్‌లో రూ.40 లక్షలతో డ్రైనేజీ కాలువ నిర్మించేందుకు స్థానిక కార్పొరేటర్ అంబటి ప్రసాదరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. తన సొంత డివిజన్ అయిన 18వ డివిజన్‌లో చెరువు కట్టమీద నిర్మిస్తున్న ట్రాక్ పనులను మేయర్ గంగాడ సుజాత పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు యనమల నాగరాజు, ఈదర సురేష్‌బాబు (చిన్నారి), గోపాల్‌రెడ్డి, ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్ సీపీ 15వ డివిజన్ అధ్యక్షుడు ఆనం శ్రీనివాసరెడ్డి, డీఈ రఘురాం, పార్టీ నాయకులు వెన్నపూస వెంకటరెడ్డి, రాములు, మారుతి, రమేష్, రవి, కోటి, చంద్ర, మట్టా శ్రీనివాసరావు, మల్లేశ్వరి, 18వ డివిజన్ నాయకులు జడా సుధాకర్, హనుమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితమైనది హనుమాన్ చాలీసా



ఊంజల్ సేవలో స్వామివారు

ఒంగోలు టౌన్: నగరంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వేద పండితులు, ఆలయ అర్చకులు శ్రీ వెంకటేశ్వర స్వామికి పన్నీరు పుష్పాలతో సహస్ర నామార్చన చేశారు. అవధి భాషలో గోస్వామి తులసీదాస్ రచించిన మహిమాన్వితమైన హనుమాన్ చాలీసాను అత్యంత భక్తిశ్రద్ధలతో 108 సార్లు పారాయణం చేశారు. సాయంత్రం స్వామివారికి నిర్వహించిన ఊంజల సేవ నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీగిరి ఆస్థాన విద్వాంసులు వీవీఎస్ వినోద్‌కుమార్ ఆలపించిన భక్తి సంకీర్తనలు రసానుభూతిని కలిగించాయి. అనంతరం వినోద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆలూరు వెంకటరమణారావు, ఆర్జిత సేవల ధర్మకర్త జ్వాలా రామారావు, కార్యనిర్వాహక ధర్మకర్త సీవీ రామకృష్ణారావు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కుష్టువ్యాధిపై అవగాహన అవసరం

ఒంగోలు రూరల్: కుష్టువ్యాధిపై అవగాహన అవసరమని డాక్టర్ సుందర్‌ప్రసాద్ తెలిపారు. మండలంలోని కరవది పీహెచ్‌సీ సమావేశ మందిరంలో శనివారం ఉదయం మండలంలోని అన్ని గ్రామాల ఆశాలు, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, హెచ్‌వీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వారికి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

వలేటివారిపాలెంలో 104 సేవలు...

మండలంలోని వలేటివారిపాలెం సబ్‌సెంటర్‌లో 104 వాహనం ద్వారా మండల మెడికల్ ఆఫీసర్ శనివారం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించారు. డాక్టర్ ఎస్.వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కూలీలు

ఒంగోలు టౌన్: గత ఎనిమిది వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లాలో సుమారు రూ.100 కోట్లకుపైగా ఉపాధి బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఎండల్లో సైతం కూలి పనులు చేసినప్పటికీ వేతనాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. బీజేపీ పాలకుల అస్తవ్యస్త విధానాల ఫలితంగా దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. గ్రామీణ పేదల కొనుగోలు శక్తి పెంచేందుకు ఉపాధి హామీ నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు జాలా అంజయ్య, నెరుసుల వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు, పెద్ద సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

కొత్తపట్నం: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించి ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేసి కార్యాలయానికి పంపించాలని ఆర్డీవో వి.విశ్వేశ్వరరావు బీఎల్ఓలను ఆదేశించారు. ఆ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బీఎల్‌వోలు ప్రతి ఇంటికి తిరిగి ఓటర్లను గుర్తించి ఫారం–6లో నమోదు చేయాలన్నారు. ఫారం 6, 6ఏ, 6బీ, 7ఏ, 7బీ, 8ఏ, 8బీ గురించి వివరించారు. మండలంలో 53 బూత్‌లకుగానూ 15 పంచాయతీల్లో 41,783 ఓట్లు ఉన్నాయని తెలిపారు. అందులో 31,127 మంది ఓటర్లకు ఆధార్ లింక్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, డీటీ అర్జున్‌రెడ్డి, ఈవోఆర్డీ ఏ బాల చెన్నయ్య, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్‌కు ఎంపిక

ఒంగోలు: డాక్టర్ వైఎస్సార్ కడప స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5 తరగతుల్లో ప్రవేశానికి జిల్లా స్థాయి ఎంపికను ఈనెల 26వ తేదీ స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు స్టెప్ చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి తెలిపారు. 2014 ఆగస్టు 1 నుంచి 2015 జూలై 31వ తేదీ మధ్యలో జన్మించినవారు, 5వ తరగతిలో ప్రవేశానికి 2013 ఆగస్టు 1వ తేదీ మొదలు 2014 జూలై 31వ తేదీ మధ్యలో జన్మించిన వారు అర్హులు. జిల్లాస్థాయి ఎంపికలో పాల్గొనేవారి వెంట వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, కాండక్ట్ రిజిస్ట్రేషన్ ఫారం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

- అనాథలైన ఇద్దరు ఆడపిల్లలు



జనార్దన్‌రావుకు నివాళులర్పిస్తున్న పీడీసీసీబీ చైర్మన్ మాదాసి వెంకయ్య

మదనూరు (కొత్తపట్నం): ఒంగోలు పీడీసీసీ బ్యాంకులో ఏటీఎం వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్న సాధు జనార్దన్‌రావు (38) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మాదాసి వెంకయ్య మేనల్లుడు అయిన జనార్దన్‌రావు నాలుగేళ్లుగా అక్కడే పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులు నిర్వహించి హెహికల్‌ను బ్యాంక్ హెడ్ ఆఫీసులో ఉంచి ఇంటికి వెళ్తూ గుండెపోటుతో కుప్పకూలి చనిపోయాడు. జనార్దన్‌రావు మృతదేహానికి శనివారం మాదాసి వెంకయ్య నివాళులర్పించారు. 2020లో జరిగిన రోడ్డు ప్రమాదంలో జనార్దన్‌రావు భార్య ప్రియాంక చనిపోయారు. అప్పటి నుంచి కుమార్తెలు ఆరాధ్య, భవానిలను జనర్దన్‌రావే చూసుకుంటున్నాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో భవాని 5వ తరగతి, ఆరాధ్య 6వ తరగతి చదువుతున్నారు. ఈ క్రమంలో తండ్రి కూడా చనిపోవడంతో ఆ పిల్లలు అనాథలైపోయారు. తండ్రిపై పడి పసిపిల్లలు బోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.లక్ష మంజూరవగా, మట్టి ఖర్చుల నిమిత్తం వెంకయ్య చేతుల మీదుగా రూ.10 వేలు అందజేశారు.